క్లుప్తంగా

దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి


విద్యార్థినులకు దిశయాప్‌ను వివరిస్తున్న ఎస్సై సురేష్‌బాబు, పోలీస్ సిబ్బంది

రామచంద్రపురం: మహిళా సంరక్షణ నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం పట్టణ ఎస్సై డి.సురేష్‌బాబు సూచించారు. ఆయన ఆధ్వర్యంలో 30 మంది పోలీస్ సిబ్బంది పట్టణంలోని దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ కళాశాలల వద్ద విద్యార్థినుల మొబైల్ ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి దానిని ఏ విధంగా వినియోగించుకోవాలో విద్యార్థినులకు అవగాహన చేశారు. ఎస్సై సురేష్‌బాబు మాట్లాడుతూ ఏదైనా ఆపద వచ్చిన సమయంలో దిశ యాప్‌ను వినియోగించడం ద్వారా దిశ పోలీసులు ఆదుకునే ప్రయత్నం చేస్తారని చెప్పారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం దిశ యాప్ ఇన్‌స్టాలేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అంగర ఎస్సై జి.చంటి ఆధ్వర్యంలోని 18 మంది మహిళా పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి కృషి చేశారు. అంగర గాంధీ సెంటర్, కపిలేశ్వరపురం గోదావరి గట్టు, వెదురుమూడి సెంటర్లలో ప్రజలకు అవగాహన కల్పించారు. నిర్దేశించిన యాప్ ద్వారా ప్రయాణికుడి వివరాలను నమోదు చేశారు. తదనంతరం మొబైల్‌లో యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేయడాన్ని వివరించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య


పసలపూడిలో అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ

రాయవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల ద్వారా విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ చిన్నారులను ఈ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. మండలంలోని పసలపూడిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆటలు, పాటలు నేర్పించడంతో పాటు కథలు, ఉచితంగా తెలుగు, ఇంగ్లిషు బోధన చేస్తున్నట్లు తెలిపారు. మానసికాభివృద్ధిని, మేథాశక్తిని పెంపొందించడం, స్వేచ్ఛ, ఆటలు, పాటలు, అమ్మను మరపించేలా అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు ఆహ్వానం పలుకుతున్నాయన్నారు. ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.ఆదిలక్ష్మి, కె.సత్యవతి, డీవీవెస్ ప్రభ, టి.భారతి, వై.సుధాయామిని, ఆర్.విజయలక్ష్మి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ


ప్రయాణికులకు మజ్జిగను అందజేస్తున్న రాజేష్

మండపేట: పట్టణంలోని బస్టాండు వద్ద ప్రయాణికులు, వాహనచోదకులకు బుధవారం చల్లటి మజ్జిగ అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. స్థానిక 4వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అయినవిల్లి రాజేష్. రూ. 15,000 విలువ చేసే బటర్‌మిల్క్‌ను 3000 మందికి పైగా ప్రయాణికులకు పంపిణీ చేసి వేసవితాపం నుంచి ఉపశమనం కలిగించారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత, వేడి గాలులు అధికంగా ఉండటంతో మజ్జిగను తాగేందుకు ప్రయాణికులు పోటెత్తారు. తన మావయ్య, పట్టణ ప్రముఖుడు కాయల అమితాబచ్చన్ జ్ఞాపకార్థం మజ్జిగను పంపిణీ చేసినట్టు రాజేష్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల శివభగవాన్, అధికారి శ్రీనివాస్, విజయ్, కోనాల చంద్రబోస్, కోయల సతీష్, అయినవిల్లి నరేష్, కాయల రమేష్, వీరబాబు పాల్గొన్నారు.

సోమేశ్వరంలో 70 మంది రక్తదానం


రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

రాయవరం: రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించడం ద్వారా ప్రాణదాతలు కావాలని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్ అన్నారు. మండలంలోని సోమేశ్వరంలో నిమ్మకాయల దోసారావు యూత్ తరఫున కర్రి భామిరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆరిఫ్ ప్రారంభించారు.శిబిరంలో 70 మంది రక్తదానం చేయగా, వీరిలో అధికంగా 'ఓ' పాజిటివ్ రక్తదాతలు ఉండడం గమనార్హం. సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పుంతరోడ్లకు మహర్దశ

- కేశవరంలో మూడు రోడ్ల పనులు ప్రారంభం
- తీరనున్న రైతుల వెతలు


పుంత రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఏళ్ల తరబడి మండలంలోని కేశవరం ఆ పరిసర గ్రామాల రైతులను పట్టి పీడిస్తున్న పుంత రోడ్ల సమస్యకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో తెరపడుతోంది. గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పొలాలకు రాకపోకలు సులభతరం అవుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేశవరం పెదకాలువ గట్టు కింద 1100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ పొలాలకు వెళ్లేందుకు నాగేడుపుంత, పెదకాలువ గట్టు, మంగలపాడు అనే మూడు పుంత రోడ్ల మీదుగా రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. వాటి పొడవు సుమారు ఎనిమిది కిలో మీటర్ల పొడవు ఉంటుంది. కేశవరంతో పాటు జెడ్. మేడపాడు రైతులు పొలాలకు ఈ పుంత రోడ్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. దశాబ్దన్నరగా ఈ పుంత రోడ్ల అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారయ్యాయని రైతులు అంటున్నారు. కొద్దిపాటి చినుకులు పడితే కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లే వీలులేక పొలాలకు ఎరువుల బస్తాలు తీసుకు వెళ్లడం కష్టతరం అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల నుంచి ట్రాక్టర్లలో ధాన్యం తరలించుకునేందుకు తీవ్ర అగచాట్లు పడాల్సి వస్తోందని తెలిపారు. గతంలో పలుమార్లు సమస్యను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని వివరించారు. రైతుల ఇబ్బందులను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు దంపతులు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్‌లు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకు రాగా ఆయన వెంటనే స్పందించారు. వర్షాలు మొదలైతే పుంత రోడ్ల పనులు ముందుకు సాగవు.అదీగాక తొలకరి సాగుకు రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, రైతుల పర్యవేక్షణలో గ్రామంలోని గ్రావెల్‌తో రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. రైతుల అవసరాల దృష్ట్యా వర్షాలు మొదలు కాకముందే త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని వెంకన్నబాబు, ఎంపీపీ శ్రీనివాస్‌లకు సూచించారు. దీర్ఘకాలంగా పట్టి పీడిస్తున్న పుంత రోడ్ల సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్సీ తోటకు ఈ సందర్భంగా స్థానిక రైతులు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, పార్టీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, తుపాకుల ప్రసన్నకుమార్, బందెల సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

అగచాట్లు పడుతున్నాం



పుంత రోడ్లు అధ్వానంగా తయారై రాకపోకలు సాగించేందుకు అగచాట్లు పడుతున్నాం. చినుకులు పడితే మోటార్ సైకిల్‌పై పొలానికి ఎరువుల బస్తా పట్టుకెళ్లడం కష్టమవుతోంది. రోడ్లు అభివృద్ధితో త్వరలో మా వెతలు తీరనున్నాయి.

– కూసు అమ్మన్న, రైతు, కేశవరం

మా వెతలు తీరతాయి



కేశవరంలో పుంతరోడ్ల అభివృద్ధితో 1100 ఎకరాల పరిధిలోని వందలాది మంది రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపిన ఎమ్మెల్సీ తోటకు రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– సలాది శివన్నారాయణ, నియోజకవర్గ ఉత్తమ రైతు కేశవరం

సింగిల్ మేజర్ డిగ్రీ ఆనర్స్ కోర్సులపై అవగాహన

రామచంద్రపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16వ తేదీన సింగిల్ మేజర్ డిగ్రీ ఆనర్స్ కోర్సులపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత స్థానిక విలేకరులకు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 నిబంధనల ప్రకారం ఏపీ ఉన్నత విద్యా మండలి సాంప్రదాయక మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సుల స్థానంలో నూతనంగా నాలుగు సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశపెడుతుందని ఆమె వెల్లడించారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి అమలు కాబోతున్న ఈ కోర్సుల్లో గతంలో మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా ఒక్కటి మేజర్ సబ్జెక్టు ఉంటుందని తెలిపారు. దీనిని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సులంటారని పేర్కొన్నారు. డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశపెట్టబడిన నూతన సింగిల్ మేజర్ ఆనర్స్ డిగ్రీ పద్ధతిపై ఇంటర్మీడియెట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించే ఉద్దేశంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16న ఉదయం 12 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన సింగిల్ మేజర్ డిగ్రీ ఆనర్స్ విద్యా విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి నూతన విధానం వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకోవడానికి, కళాశాలలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుకు తప్పక హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ త్రిమూర్తులు
- రాయవరంలో గడప గడపకూ..


రాయవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ప్రజా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాయవరంలో బుధవారం రెండో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు పరిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి దేశంలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకు వచ్చారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పేదల ఇంటి ముంగిటకే సేవలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, అధికార దాహంతో ప్రతిపక్షాలు చెప్పే మాటలు నమ్మవద్దని ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రజలకు పిలుపునిచ్చారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీటీసీ గంటి రోజా, కోఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్ తదితరులతో కలిసి ఎమ్మెల్సీ త్రిమూర్తులు గడపగడపకు వెళ్లి ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు.

మాదిగలను మభ్యపెట్టేందుకే టీడీపీ ఆత్మీయ భేటీ

ఎంఎస్‌పీ రాష్ట్రనేత జయరాజు ధ్వజం


దూలి జయరాజు

మండపేట: ఎస్సీ వర్గీకరణతోనే రాష్ట్రంలోని మాదిగలకు మేలు జరుగుతుందని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు అన్నారు. మండపేటలోని ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అమరావతిలో జరిగింది మాదిగల ఆత్మీయ సమావేశమా ? లేక టీడీపీ భజన సమావేశమా ? అని ఆయన ధ్వజమెత్తారు. టీడీపీ మాదిగలను ఇంకా మభ్య పెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మాదిగల ఆత్మీయ సమావేశం తీరు చూస్తే మాదిగలను టీడీపీ భజన పరులుగాను చేసేందుకేనన్న విషయం తేటతెల్లమవుతుందని ఆయన మండిపడ్డారు. మాదిగల్లో ఇప్పుడు ఐక్యత రావడంతో పాటు రాజకీయ చైతన్యం పెరిగిందని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయి నాయకులతో మాట్లాడి వారి సమస్యలు పరిగణనలోకి తీసుకోకుండా, మాదిగ జాతి భవిష్యత్తు అయిన ఎస్సీ వర్గీకరణపై చర్చ లేకుండా సమావేశం నిర్వహించడం సరి కాదన్నారు. రాజకీయంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాదిగలకు 75 ఏళ్లుగా జరుగుతున్న అన్యాయంపై మాట్లాడకపోవడం దారుణమని జయరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగల రాజ్యాధికార వాటా లెక్క తేల్చకుండా తమ జాతిని బుట్టలో వేసుకోవాలని చూస్తే టీడీపీకి 2019లో పట్టిన గతే రానున్న ఎన్నికల్లోను పడుతుందని ఈ సందర్భంగా జయరాజు హెచ్చరించారు.

517 మట్టి నమూనాల సేకరణ


లొల్లలో మట్టి నమూనాల సేకరణపై వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

రాయవరం: పరీక్షల కోసం మండలంలో 517 మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. దీనిపై మండల వ్యవసాయ సహాయకులకు బుధవారం ఏవో అవగాహన కల్పించారు. మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలి? మొబైల్ యాప్‌లో ఏ విధంగా ఆన్‌లైన్ చేసే విధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులందరూ తొలకరి పంటకు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారన్నారు. నారుమడులు త్వరితగతిన వేసుకోవడమే గాకుండా నారుమడి వేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సహాయం ఏడాదికి రూ.6 వేలు రావాలంటే తప్పనిసరిగా రైతుల బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. బయోమెట్రిక్ వేయని పక్షంలో వారు పూర్తిగా పీఎం కిసాన్‌కు అర్హత కోల్పోతారన్నారు. ఇదే విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే రైతులు, కౌలు రైతుల వివరాలతో వీఆర్వో వద్దకు పంపించి, వారికి కౌలు రైతు కార్డులు ఇప్పించేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు.

సత్యను సత్కరించిన కలెక్టర్ మాధవీలత


సత్యను సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత


రెడ్ క్రాస్ సంస్థ నుంచి అవార్డు స్వీకరిస్తున్న మూర్తి

మండపేట: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఏడిదకు చెందిన రక్తదాత యడ్ల సత్యను కలెక్టర్ మాధవీలత సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 28 సార్లు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు.

అవార్డు పొందడం ఆనందంగా ఉంది

రామచంద్రపురం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మానవతాసంస్థ రెడ్ క్రాస్ నుంచి సన్మానం పొంది అవార్డును తీసుకోవటం ఆనందంగా ఉందని బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి అన్నారు. కాకినాడలో బుధవారం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రక్తదాన శిబిరాలు నిర్వహించి వేలాది మందికి ప్రాణదానం చేసినందుకు జేఎన్టీయూ వైస్ చాన్సలర్ ప్రసాదరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, వైస్ చైర్మన్ ఎస్.సుగుణ, సెక్రటరీ శివకుమార్, అప్పలరాజు, ప్రముఖ డాక్టర్లు, కోస్ట్ గార్డు అధికారులు చేతుల మీదుగా ఘనంగా సత్కరించి సర్టిఫికెట్‌ను అందించినట్లు స్థానిక విలేకరులకు మూర్తి తెలిపారు.

కేశవరం గ్రామాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- రూ. 91 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మండపేట: కేశవరం గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రూ.91 లక్షలతో గ్రామంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్‌లతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో ముక్కపాటి చినబాబు ఏర్పాటుచేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. అనంతరం కోకోకోలా కంపెనీ సౌజన్యంతో సుమారు రూ. 50 లక్షలతో నిర్మించే స్కూల్ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్సీ తోట భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. స్కూల్ ప్రహరీ నిర్మాణ సమయంలో సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించాలని, ఈ విషయంలో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దని తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావును ఆదేశించారు. ఆక్రమణల తొలగింపులో ఎవరైనా ఇళ్లు కోల్పోతే వారికి ప్రభుత్వం ద్వారా స్థలం, ఇల్లు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్సీ తోట హామీ ఇచ్చారు. అనంతరం జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. తొలుత మండల పరిషత్ నిధులు రూ. 16.5 లక్షలతో ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా నిర్మించే సీసీ రోడ్డుకు, పంచాయతీ నిధులు రూ. 25 లక్షలతో నిర్మించే గ్రామంలో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైన్లు, బోరు పనులకు ఎమ్మెల్సీ తోట భూమిపూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

కష్టం ఇష్టమైంది..ర్యాంకు వశమైంది

రాయవరం: ఉన్నత విద్యకు వారధి లాంటి ఇంటర్మీడియేట్‌లో ప్రణాళికాబద్ధంగా చదివి, ఉత్తమ మార్కులు సాధించడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఏపీ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్షలో మన ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి ఔరా..అన్పించారు. గత నెల 15 నుంచి 19 వరకు ఇంజనీరింగ్, 22, 23 తేదీల్లో అగ్రికల్చర్ ఫార్మసీ ఎంట్రన్స్ పరీక్షలు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కేవలం నెల రోజుల్లోనే ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో పలువురు విద్యార్థులు ఉత్తమమైన ర్యాంకులు సాధించి, భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారు.

సుమలతకు 481వ ర్యాంకు


పెద్దింశెట్టి సుమలత

కపిలేశ్వరపురం: టేకి గ్రామానికి చెందిన పెద్దింశెట్టి సుమలత ఏపీ ఈఏపీ సెట్– 2023 అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ విభాగం ఫలితాల్లో 481వ ర్యాంకు సాధించింది. తండ్రి శ్రీనివాస్ రైతు కాగా తల్లి భాగ్యలక్ష్మి గ్రామ సచివాలయంలో వైద్య ఆరోగ్య కార్యకర్త. చిన్నప్పటి నుంచి చదువుపట్ల ఆసక్తి చూపుతున్న సుమలతను చదువుల్లో తల్లిదండ్రులు శ్రీనివాస్, భాగ్యలక్ష్మి ప్రోత్సహించారు. పదో తరగతిలో 600 కి 598 మార్కులు, ఇంటర్మీడియట్ బైపీసీలో వెయ్యికి 985 మార్కులు సాధించింది. ఇటీవల విడుదలైన నీట్‌లో ఫలితాల్లో 541 మార్కులు సాధించి 70 వేల ర్యాంకు స్థానంలో నిలిచింది.

సైక్రియాటిస్ట్ కావాలని ఉంది



ఏపీ ఈఏపీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో 466 ర్యాంకు సాధించాను. సైక్రియాటిస్ట్‌ను అవ్వాలన్నది నా లక్ష్యం. నీట్ పరీక్షలో 720 మార్కులకు 627 మార్కులు సాధించి ఆల్ ఇండియా ర్యాంకు 14,822 సాధించాను. తల్లిదండ్రులు శ్రీలక్ష్మి, సత్యనారాయణరెడ్డి, పెదనాన్న శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఉత్తమ ర్యాంకును సాధించాను.

– సత్తి భువన వికాస్‌రెడ్డి, వి.సావరం, రాయవరం మండలం

విద్యార్థులకు జేవీకే కిట్ల పంపిణీ

రాయవరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసిస్తున్నారని, అందుకే విద్యకు పెద్దపీట వేస్తున్నారని జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు అన్నారు. సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న విద్యా కానుకల పంపిణీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుల విప్లవం నడుస్తుందన్నారు. పాఠశాల విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, నల్లమిల్లి వెంకటరెడ్డి, హెచ్‌ఎం ఆర్.దయామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.గంగవరం: విద్యను అభివృద్ధి చేసిన పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, సర్పంచ్ చీకట్ల సునీత అన్నారు. మండలంలోని పాణింగపల్లిలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లను విద్యార్థులకు వారు అందించారు. సొసైటీ అధ్యక్షుడు వైట్ల అచ్యుతరామప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాజులూరు: సీఎం జగన్ పాలనలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పురోగతి చెందుతున్నాయని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. బుధవారం మండలంలోని కుయ్యేరు జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లను జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి సంయుక్తంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈఓ కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపరచారన్నారు. సీఎం జగన్ విద్యకు ప్రాధాన్యమిస్తూ 'నాడు–నేడు' ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో వాటి రూపురేఖలే మారిపోయాయన్నారు. కార్యక్రమంలో మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ చీకట్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపాలెంలో ఎంపీయూపీ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని పద్మజ ఆధ్వర్యంలో సర్పంచ్ కట్టా గోవిందు, ఉప సర్పంచ్ వల్లు శివల చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లు బుధవారం పంపిణీ చేశారు. సర్పంచ్ గోవిందు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యా సంవత్సరం ప్రారంభించిన వెంటనే విద్యార్థులకు విద్యాకానుక అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో 4వ విడత విద్యాకానుకల పంపిణీ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. మండలంలోని 37 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలకు చెందిన 3,777 మందికి విద్యా కానుకలను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ కె.తాతారావు తెలిపారు.

రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి డిజైన్ల పరిశీలన

మండపేట: కేశవరంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి బుధవారం ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రైల్వే అధికారులతో కలిసి డిజైన్లు పరిశీలించారు. కేశవరం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రైల్వేశాఖ ఫ్లైఓవర్ మంజూరు చేసిన విషయం విదితమే. బుధవారం ఎంపీ భరత్‌రామ్, రైల్వే అధికారులు అనపర్తి వెళుతూ మార్గ మధ్యలో కేశవరం వద్ద ఎమ్మెల్సీ తోటను కలిశారు. రైల్వే అధికారులు తయారు చేసిన డిజైన్లపై చర్చించారు. అనంతరం ద్వారపూడి రైల్వే ఫ్లైఓవర్‌ను పరిశీలించారు.

'శ్రీమోక్ష' సేవాసంస్థ ప్రారంభం

మండపేట: స్థానిక 20వ వార్డు గొల్లపుంత కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీమోక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రారంభోత్సవ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు ఎగ్గాడి లోవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నేత కొమ్ము రాంబాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. లోవరాజు మాట్లాడుతూ ప్రతి ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత అన్నదానం నిర్వహిస్తామన్నారు. అనంతరం 150 మందికి పైగా పేదలకు సంస్థ తరఫున రాంబాబు, కౌన్సిలర్ కొవ్వాడ బేబి, వైఎస్సార్ సీపీ నేత టేకిమూడి శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుండు వీరతాతరాజు, ఏపీ ఎంఆర్‌పీఎస్ఎస్ వ్యవస్థాపకుడు బుంగా సంజయ్‌లు దుస్తులు అందజేశారు. పార్టీ నాయకులు అప్పన్నబాబు, మండపల్లి సంజీవ్, సంస్థ సభ్యులు తాతపూడి సందీప్, బొడ్డపాటి లక్ష్మణ్, మండపల్లి సూరిబాబు, ఎగ్గాడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సర్వేను వేగవంతం చేయండి

రాయవరం: వైఎస్సార్ బీమా సర్వేను వేగవంతం చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిఎ. శాంతి సూచించారు. మండలంలోని సోమేశ్వరం సచివాలయం-1ను ఆమె బుధవారం తనిఖీ చేశారు. వైఎస్సార్ బీమా సర్వే ప్రగతిని డీఎల్‌డీవో శాంతి, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డితో కలిసి సమీక్షించారు. జగనన్న పాల వెల్లువ సర్వేను కూడా వేగవంతం చేయాలని సచివాలయ అసిస్టెంట్లకు సూచించారు. గ్రామ సచివాలయాల్లో ఎప్పటికప్పుడు రికార్డులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. శాంతి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 1,23,324 మంది వైఎస్సార్ బీమా పరిధిలో అర్హులుగా ఉన్నారన్నారు. గురువారంతో వైఎస్సార్ బీమా సర్వే ముగుస్తువదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏడిదలో జన్ భాగీదారీ

మండపేట: చిన్నారులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందేందుకు అంగనవాడీ కేంద్రాలు దోహదపడతాయని వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు అన్నారు. జన్ భాగీదారీ కార్యక్రమంలో భాగంగా బుధవారం సెక్టార్ సూపర్ వైజర్ శ్రీదేవి అధ్యక్షతన ఏడిద గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ సెంటర్లకు పంపాలని సూచించారు. వారికి ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తారన్నారు. సీహెచ్‌ఓ సౌభాగ్యలక్ష్మి, శ్వేతాదీపిక, స్వాతి, కన్నయ్యనాయుడు, దేవి, కుమారి, భారతి, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు సిద్ధం

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతులకు ఎంటీయూ 7029 రకం వరి విత్తనాలు సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్నాయని ఏవో ఎన్.సత్యప్రసాద్ బుధవారం తెలిపారు. ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలు కేజీకి రూ.5 చొప్పున సబ్సిడీ పోను 30 కేజీల బస్తాకు రూ.993 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. రైతులు తమతమ గ్రామాల్లోని ఆర్బీకేల నుంచి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా సూడోమోనాస్ ద్రావకం కేజీ విత్తనాలకు 8 గ్రాముల చొప్పున ఉపయోగించి విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. మండలంలోని యనమదలలో రైతులకు విత్తనాలు పంపిణీలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు ఫ్యాన్లు

మండపేట: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వెనుక మేదరపేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి లయన్స్ క్లబ్ మండపేట శాఖ అధ్యక్షుడు గుండు వీరతాతరాజు బుధవారం రెండు ఫ్యాన్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్‌లోని చిన్నారుల సౌకర్యార్థం ఫ్యాన్లు అందజేశామన్నారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కోనే వీర్రాజు, వాదా ప్రసాదరావు, అబ్బాస్, భాస్కరరావు, అంగన్‌వాడీ కార్యకర్త రాణి పాల్గొన్నారు.